సాక్షి నిర్మల్
శుక్రవారం । 10 । మార్చి । 2023



'పచ్చని' విద్యాలయం 8లో▸

బాసరలోని ట్రిపుల్‌ఐటీ కళాశాల పచ్చదనంతో కళకళలాడుతోంది. హరితహారంలో ఇక్కడి విద్యార్థులు భాగస్వాములయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ హరిత పురస్కారం సాధించారు.



'పది'పై ప్రత్యేక నజర్ 9లో▸

పదో తరగతిలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఒకటో ప్రీఫైనల్ పరీక్షలు రాసిన విద్యార్థులు.. ఈనెల 15 నుంచి రెండో ప్రీఫైనల్‌కు సిద్ధమయ్యారు.

గరిష్టం/కనిష్టం
34.2 /20.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న వివిధ రంగాల మహిళలు

నిర్మల్‌టౌన్: జిల్లా చలనచిత్ర టీవీ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాలకృష్ణ, సర్నాపూర్ ఎస్సై గీత, నీలిమ, డాక్టర్ కృష్ణవేణి, లాయర్ నిర్మల, మేరీమాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలు త్వరగా సేకరించాలి



సరితను సన్మానిస్తున్న పాలమిత్రలు

నిర్మల్‌చైన్‌గేట్: రాబోవు వేసవి దష్ట్యా పాలు త్వరగా సేకరించాలని నిజామాబాద్ విజయ డెయిరీ ఉప సంచాలకులు డాక్టర్ నందకుమారి అన్నారు. స్థానిక విజయ డెయిరీలో గురువారం నిర్వహించిన పాలమిత్రలు, పాడి రైతుల సమావేశంలో పాల్గొన్నారు. నాణ్యత విషయాలపై సూచనలు చేశారు. సొంత నిధులతో నగర్, పాకపట్లు, బాబాపూర్ తదితర గ్రామ రైతులు ఆవులు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి డీజీఎం వేణుగోపాల్‌రెడ్డిని రైతులు కోరడంతో స్త్రీనిధి ద్వారా జిల్లాలో విజయ డెయిరీకి పాలుపోసే రైతులకు పాడి పశువుల కొనుగోలుకు ఋణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సరితను మహిళా పాలమిత్రలు పుష్పలత, చంద్రకళ, సుజాత, సురేఖ, రజిత, రాణి అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా సన్మానించారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెంబి: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీటీవో అంబాజీ సూచించారు. మండలంలోని కోసగుట్ట గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని ప్రాజెక్టు రూం, లైబ్రరీ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏసీఎంవో శివాజీ, హెచ్‌ఎం ప్రకాశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు జరగబోయే కంటి వైద్య శిబిరాన్నిపెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని పేర్కొన్నారు.

అబ్దుల్లాపూర్ సర్పంచ్, వీడీసీ సభ్యులపై ఫిర్యాదు



ఫిర్యాదును చూపుతున్న పెద్ద గంగన్న

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన కొబ్బనోల్ల పెద్ద గంగన్న అబ్దుల్లాపూర్ సర్పంచ్, వీడీసీ సభ్యులపై పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ తెలిపారు. మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన కొబ్బనోల్ల పెద్ద గంగన్నకు కన్కపూర్ గ్రామశివారు 328/అ సర్వే నంబరులో 5 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో 33 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఆ భూమిని అబ్దుల్లాపూర్ సర్పంచ్, వీడీసీ సభ్యులు కబ్జా చేశారు. భూమి విషయమై అడిగితో కులం పేరుతో ధూషించారని ఆరోపించారు. భూకబ్జా చేసిన సర్పంచ్, 19 మంది వీడీసీ సభ్యులపై పోలీసులు చర్యలు తీసుకుని తన భూమిని ఇప్పించాలని కోరాడు. ఆయన వెంట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి ముత్తన్న, మండల నాయకులు దేవేందర్, బాధిత రైతు కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఏనాళ్లీ విపత్తి!



ఈ రైతుపేరు భూమేశ్. రాయపూర్‌కాండ్లీకి చెందిన భూమేశ్ నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాడు. ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు చేశాడు. కానీ, ఆశించిన మేర దిగుబడి రాలేదు. వచ్చిన దిగుబడికి అయినా మంచి ధర వస్తుందని ఎదురుచూసినా నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఉన్న ధరకు పత్తిని అమ్మలేక ఇంట్లోనే నిల్వ చేశాడు. ధర పెరుగుతుందన్న ఆశతో ఎదురు చూస్తున్నాడు.



ఈ రైతుపేరు సురేశ్‌బాబు. ఈయన పంట నుంచి పత్తిని తీసి ఇంట్లోనే నిల్వ చేశాడు. ఇప్పుడు ఉన్న ధరకు అమ్మితే పెట్టుబడి రాదని, సీజన్ ముగిసిన తర్వాత ధర పెరుగుతుందన్న ఆశతో ఎదురు చూస్తున్నాడు. తక్కువ ధరకు కొనేందుకు దళారులు వస్తున్నారని వారికి అమ్మినా నష్టమే అంటున్నాడు. ప్రభుత్వం పత్తి ధర పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

- ఇళ్లలోనే తెల్ల బంగారం
- మద్దతు ధర కోసం మూడు నెలలుగా నిరీక్షణ
- అయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



లోకేశ్వరంలోని ఓరైతు ఇంటి ఆవరణలో నిల్వ చేసిన పత్తి

లోకేశ్వరం: రైతు ఈ ఏడాది వి'పత్తి' నుంచి కోలుకోవడం లేదు. విత్తనం నుంచే మొదలైన సంక్షోభం.. పంట చేతికి వచ్చినా ముగియలేదు. విత్తనాల కొనుగోలు సమయంలో నకిలీ బెడదతో ఇబ్బంది పడ్డ రైతులు తర్వాత వర్షాభావం, అధిక వర్షాలు పత్తి రైతులను తిప్పలు పెట్టాయి. వర్షాలు, వరదలకు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. తర్వాత మిగిలిన పంటలపై తెగుళ్లు దాడిచేశాయి. డక్కామొక్కిలను ఎదుర్కొన్న రైతులకు పంట చేతికి వచ్చిన తర్వాత అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. పెట్టుబడులు పెరగడం, ధర పతనం కావడంతో పత్తిరైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. మార్కెట్‌లో రూ.7,500 నుంచి రూ.8 వేలలోపే ధర పలుకుతుండడంతో రైతులు ఇళ్లలోనే నిల్వ చేశారు. మూడు నెలలుగా పత్తి నిల్వలు మార్కెట్‌కు రాకపోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పత్తి ధర పెరిగేలా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ధర పెరుగుతుందని..

ఈ ఏడాది పత్తిని సాగుచేసిన రైతులు దిగుబడి చేతికి వచ్చినా మార్కెట్‌లో ధర ఆశించిన మేరకు లేకపోవడంతో ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. మూడు నెలలుగా పత్తి రైతుల ఇంటి గడప దాటడం లేదు. ధర పెరుగుతుందన్న ఆశతో నిరీక్షిస్తున్నారు. కేంద్రం పత్తి క్వింటాల్‌కు రూ.6,080 మద్దతు ధర ప్రకటించింది. మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7,500 నుంచి రూ.8 వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో సీసీఐ కూడా కొనుగోళ్లు చేపట్టడం లేదు. మద్దతు ధరకన్నా తక్కువ ధర ఉన్నప్పుడు మాత్రమే సీసీఐ పత్తి కొనుగోళ్లు జరుపుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మద్దతు ధరకన్నా ఎక్కువకే వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో సీసీఐ ముందుకు రావడం లేదు.

పెరిగిన పెట్టుబడి..

ఈ ఏడాది జిల్లాలో 65 వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. క్వింటాల్‌కు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాలి. అయితే జూలైలో కురిసిన భారీ వర్షాలకు వరదలు రావడంతో పంటలు కొట్టుకుపోయాయి. వేర్లు కుళ్లిపోయి మొక్కలు మురిగిపోయాయి. తర్వాత తెగుళ్లు ఆశించడంతో మరింత నష్టం జరిగింది. వర్షాలు, వరదలు, తెగుళ్ల ప్రభావంతో ఈ ఏడాది దిగుబడి 4 నుంచి 5 క్వింటాళ్లకు పడిపోయింది. మరోవైపు తెగుళ్ల బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు పురుగు మందులు, రసాయన ఎరువులు అధికంగా పిచికారీ చేశారు. మరోవైపు వర్షాలకు చేలల్లో విపరీతంగా కలుపు పెరిగింది. దీంతో ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేలు అయ్యే పెట్టుబడి రూ.40 వేలు దాటింది. మరోవైపు దిగుబడి సగానికి పడిపోయింది.

మార్కెట్‌కు వచ్చింది 60 వేల క్వింటాళ్లే..

సాధారణంగా ఎకరాకు పత్తి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి సగానికి పడిపోయింది. దీంతో ఎకరాకు 4 క్వింటాళ్ల చొప్పున 60 వేల ఎకరాల్లో 2.60 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. మార్కెట్‌కు 2 లక్షల క్వింటాళ్లు అమ్మకానికి రైతులు తెస్తారని భావించారు. కానీ కొనుగోళ్లు ప్రారంభించి మూడు నెలలైనా ఇప్పటి వరకు మార్కెట్‌కు వచ్చింది కేవలం 60 వేల క్వింటాళ్లే. ఇంకా 1.40 లక్షల క్వింటాళ్ల పత్తి రైతుల ఇళ్లలోనే ఉంది. మరో 60 వేల క్వింటాళ్లను రైతులు దళారులకే, పొరుగున ఉన్న మహారాష్ట్రకు వెళ్లి విక్రయించినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం లక్ష క్వింటాళ్లకుపైగా పత్తి రైతుల ఇళ్లలోనే ఉన్నట్లు పేర్కొంటున్నారు.

పత్తిసాగు ఖర్చు (ఎకరాకు)

ట్రాక్టర్‌తో దున్నేందుకు	రూ.5 వేలు
అచ్చు కట్టడానికి	రూ.800
విత్తడానికి కూలీల ఖర్చు	రూ.3 వేలు
కలుపుతీయడం, దౌర ఖర్చు	రూ.3 వేలు
రసాయన ఎరువులు, పురుగు మందులు	రూ.11 వేలు
ఎరువులు	రూ.8 వేలు
పత్తి ఏరేందుకు	రూ.10 వేలు
మొత్తం	రూ.40,800

ఈ ఏడాది దిగుబడి అంచనా
2.60 లక్షల క్వింటాళ్లు
ఇప్పటి వరకు రైతులు మార్కెట్‌కు తెచ్చింది 60 వేల క్వింటాళ్లు

పత్తి ధర ఇలా..

ఈసారి ఎన్నడూ లేని విధంగా భైంసా మార్కెట్ ప్రారంభంలో పత్తి ధరను పెంచారు. క్వింటాలు పత్తి ధర ప్రారంభంలో రూ.9,500 వరకు పలికింది. తర్వాత క్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.7,500 నుంచి రూ.8 వేల మధ్య ఉంటుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం కారణంగానే పత్తి ధర అంతర్జాతీయంగా పెరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు లక్ష క్వింటాళ్ల పత్తి రైతుల ఇళ్లలోనే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ధర పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సీజన్ ముగింపులో ధర పెరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పత్తి ధర పెరిగేలా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



జిల్లా ఆసుపత్రి సిబ్బందితో కాయకల్ప బృందం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కాయకల్ప ఫైనల్ అసెస్మెంట్ బృందం సభ్యులు డాక్టర్ పూజారి రఘు(ఎక్స్టటర్నల్ ఆసేసార్ ఎన్‌ఎచ్‌ఆర్సీ), డాక్టర్ రెహ్మాన్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), సిస్టర్ స్టెల్లా(ఎంపానల్ ఎక్స్టర్నల్ ఆసేసార్ ఎన్‌ఎచ్‌ఆర్సీ), డాక్టర్ ప్రశాంత్ (పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్) గురువారం పరిశీలించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏటా అందించే కాయకల్ప అవార్డు ఎంపికలో భాగంగా బృందం సభ్యులు ఆసుపత్రిని సందర్శించారు. అన్ని విభాగాలను సందర్శించి స్వచ్ఛత, సదుపాయాలు, బయో మెడికల్ వేస్టేజ్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, పారిశుద్య రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి, ఆసుపత్రి నిర్వహణ అంశాలపై స్కోరింగ్ వేసి ఆ రిపోర్ట్‌ను పై అధికారులకు సమర్పించారు. త్వరలోనే విజేతలను ప్రకటించనున్నారు. వీరి వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, ఆసుపత్రి ఆర్‌ఎంవో వేణుగోపాలకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ రిజ్వాన్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, ఆఫీస్ సూపరింటెండెంట్ రఘునాథ్ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్లోని టీ–హబ్ డయాగ్నోస్టిక్ సెంటర్, జిల్లా హాస్పిటల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి దరఖాస్తు చేసుకున్న రేడియోగ్రాఫర్ల (పురుషులు–1 మరియు స్త్రీలు –1) తాత్కాలిక జాబితా సూపరింటెండెంట్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్, నిర్మల్ ఆఫీసు నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు డీసీఎచ్‌ఎస్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 13వ తేదీ వరకు సూపరింటెండెంట్ కార్యాలయంలో తెలియజేయాలని సూచించా రు. రేడియోగ్రాఫర్ పోస్టుకు డిప్లొమా లేక బీఎ స్సీ(రేడియోగ్రఫీ), డీఎంఐటీ(డిప్లొమా ఇన్ మె డికల్ ఇమేజింగ్ టెక్నాలజీ) చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఉమెన్ రేడియోగ్రాఫర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారు పైన పేర్కొ న్న అర్హతలతోపాటు మమోగ్రామ్ ట్రైనింగ్ చేసి ఉండాలని తెలిపారు.

కొనసాగుతున్న ట్రైనీ అధికారుల పర్యటన



పార్‌పెల్లి పీహెచ్‌సీ వద్ద ట్రైనీ అధికారులు



నచ్చన్‌ఎల్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో..



ఎర్వచింతల గ్రామంలో..

లక్ష్మణచాంద/కడెం/ఖానాపూర్: జిల్లాలో ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారుల పర్యటన కొనసాగుతోంది. గురువారం లక్ష్మణచాంద, కడెం, ఖానాపూర్ మండలాల్లో పర్యటించారు. లక్ష్మణచాందలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, యువకులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారో సిబ్బందిని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామ సమీపంలోని ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రదేశాన్ని సందర్శించారు. అక్కడ కూలీలతో మాట్లాడారు. రోజుకు కూలి ఎంత వస్తుందని ఆరా తీశారు. పని ప్రదేశంలో మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. నీడ కోసం టెంటు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వారివెంట సర్పంచ్ రాజేందర్, వీడీసీ సభ్యుడు శ్రావణ్, వైద్య సిబ్బంది శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు ఉన్నారు. కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో ట్రైనీ అధికారులు సందీపన్ సర్కార్, బంటి కుమార్, అలీషాఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా పర్యటించారు. ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను పరిశీలించి, లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. బీడీ కార్మికులతో సమావేశమై వారి రోజువారీ కూలి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పలకలు అందించారు. వారివెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో వెంకటేశ్, సర్పంచ్ బొడ్డు గంగన్న, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, కార్యదర్శి మనోజ్ తదితరులు ఉన్నారు. ఖానాపూర్ మండలం ఎర్వచింతల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ట్రైనీ అధికారులు ముస్కాన్ జైన్, ఛాయాసింగ్, శిఖారాయ్, రూపాలి దశరథ్ కర్నే, అంజలి మోరియా సందర్శించారు. చిన్నారులకు కానుకలు అందించారు. రాత్రికి గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారివెంట సర్పంచ్ కొడారి గోపాల్, ఉపసర్పంచ్ దేవేందర్, కార్యదర్శి హనుమంతు, ఫీల్డ్ అసిస్టెంట్ పీర్యా, ఐకేపీ సిబ్బంది రవీందర్, ఏఎన్‌ఎం చంద్రకళ తదితరులు ఉన్నారు.

భైంసాలో ప్రశాంతంగా వార్డు సభ

- జాబితాలో పేర్లు లేవంటూ పలువురి అభ్యంతరం
- అదనపు కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న మహిళలు



అదనపు కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న మహిళలు

భైంసాటౌన్: భైంసా పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం నిర్వహించిన వార్డుసభ ప్రశాంతంగా ముగిసింది. ఆయా వార్డుల్లో కౌన్సిలర్ల సమక్షంలో అర్హుల జాబితా ప్రదర్శించారు. అలాగే జాబితాలో అనర్హులుంటే అభ్యంతరాలు తెలపాలని వార్డు అధికారులు కోరారు. కాగా, అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే జాబితాలో అనర్హుల పేర్లున్నాయని ఆరోపించారు. పలువురు మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఉన్న అదనపు కలెక్టర్ రాంబాబు వాహనాన్ని అడ్డుకున్నారు. అర్హులమైనా తమ పేర్లు లేవంటూ నిలదీశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించడంతో వారు పక్కకు తప్పుకున్నారు.

అర్హులకే డబుల్‌బెడ్రూం ఇళ్లు..

అర్హులైన వారికే డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని ఆర్డీవో రవికుమార్ అన్నారు. పట్టణంలో 1,323 మంది అర్హుల జాబితా వార్డుసభల్లో ప్రదర్శించామన్నారు. పట్టణంలో 604 డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించగా, వీటిలో 400 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం లక్కీడ్రా పద్ధతిలో అర్హుల తుది ఎంపిక ఉంటుందన్నారు. టీఎస్‌టీఎస్(తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విభాగం) ఆధారంగా దరఖాస్తుదారు పేరు మీద ఇంటి టాక్స్, కరెంట్ మీటర్ ఉన్నా, ఇన్‌కంటాక్స్ పరిధిలో ఉన్నా, ప్రభుత్వం నుంచి భూమి లబ్ధి పొందినా అనర్హులుగా గుర్తించబడతారన్నారు. ఇందులోభాగంగానే జాబితాలో కొందరి పేర్లు రాలేదని పేర్కొన్నారు. అర్హులుగా ఉండి జాబితాలో పేర్లు లేకుంటే మరోమారు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 1,323 మంది అర్హుల జాబితా వార్డు సభల్లో ప్రదర్శించామని చెప్పారు.

'డబుల్' కిరికిరి..!

- అధికారులకు తలనొప్పిగా లబ్ధిదారుల ఎంపిక
- తమ పేర్లు లేవంటున్న 'ఇందిరమ్మ' పట్టాదారులు
- ఉన్నవి 660, అర్హులు 1,323



అర్హుల జాబితాలో పేర్లు పరిశీలిస్తున్న దరఖాస్తుదారులు(ఫైల్)

భైంసాటౌన్: భైంసాలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. ముందుగా వార్డు సభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, రెండు దఫాలుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి తాత్కాలిక అర్హుల జాబితా రూపొందించారు. అనంతరం గత నెల 25న మరోమారు వార్డు సభ ఏర్పాటు చేసి, అర్హులు, అనర్హుల జాబితాలు వార్డుల వారీగా ప్రదర్శించారు. జాబితాల్లో అనర్హులు పేర్లు ఉంటే తెలపాలని, అభ్యంతరాలు స్వీకరించారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం పట్టణంలో 6,811 మంది దరఖాస్తులు చేసుకోగా, మొదటి దఫా వెరిఫికేషన్‌లో 2,886 అనర్హులుగా గుర్తించి తొలగించారు. మరోమారు రెండో దఫా పరిశీలనలో 2,529 మంది జాబితాలో 1,032 మందిని అనర్హులుగా పేర్కొన్నారు. అనంతరం ఈ జాబితాను ఉన్నతాధికారులకు పంపించగా, టీఎస్‌టీఎస్(తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల విభాగం) డేటాలో 376 మంది అనర్హులుగా గుర్తించి 1,121 మందితో తాత్కాలిక అర్హుల జాబితా గతనెలలో నిర్వహించిన వార్డుసభలో ప్రదర్శించారు. చాలామంది తమ పేర్లు లేవంటూ మరోమారు దరఖాస్తులు చేసుకున్నారు.

ఇళ్లు 660, అర్హులు 1,323..

భైంసా పట్టణానికి ప్రభుత్వం 660 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేసింది. వీటిలో 400 వరకు ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీనికితోడు మొదటిదశలో నిర్మించిన ఇళ్లలో గుండెగాం ముంపు బాధితులు నివాసం ఉంటున్నారు. వారికి పునరావాసం కింద స్థలాలు కేటాయించే వరకు వారిని కదల్చలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో అర్హులైనవారందరికీ ఇళ్లు ఎలా కేటాయిస్తారోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మరోమారు వార్డుసభ నిర్వహించిన అధికారులు, 1,323 మంది అర్హుల జాబితా ప్రదర్శించారు. దీంతో గత జాబితాలో తమ పేరుండి, ప్రస్తుత జాబితాలో పేరు కనిపించడం లేదంటూ పలువురు అధికారులను ప్రశ్నించారు. కొందరు మహిళలు ఏకంగా అదనపు కలెక్టర్ వాహనాన్ని అడ్డుకుని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, లక్కీడ్రా పద్ధతిలో లబ్ధిదారుల తుది ఎంపిక చేపడతామని అధికారులు చెబుతుండగా, మిగిలిన అర్హులు తమ పరిస్థితి ఏంటని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

స్థలం ఇచ్చిన 'ఇందిరమ్మ' లబ్ధిదారులు...

భైంసా పట్టణంలోని పలువురికి గతంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా 138 సర్వే నంబర్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. కాగా, భైంసాకు మంజూరైన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో, స్థానిక ఎమ్మెల్యేతోపాటు అధికారులు లబ్ధిదారులకు స్థలాలకు బదులు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో వారు స్థలాలు అప్పగించారు. ప్రస్తుతం అధికారులు ప్రదర్శించిన అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందిస్తున్నారు. తమకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు..

రాష్ట్ర సాంకేతిక విభాగంలోని డేటా ఆధారంగా డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నాం. దరఖాస్తుదారు పేరు మీద ఇంటిపన్ను, విద్యుత్ మీటర్ వంటివి ఉంటే అనర్హులుగా పరిగణించబడతారు. అర్హులుగా ఉండి పేర్లురాని వారుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రవికుమార్, ఆర్డీవో, భైంసా

సాధారణ ప్రసవాలు పెంచాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో సాధారణ ప్రసవాలు సంఖ్య పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. సిజేరియన్ కాన్పులు తగ్గించాలని సూచించారు. ఇ1 సెక్షన్ జరిగితే ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరాలు అడిగి తెలుసుకుని, వైద్యాధికారులు ఇచ్చే రిపోర్ట్ సరైందిగా ఉండాలన్నారు. సాధ్యమైనంత ఎక్కువగా సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మొదటి కాన్పు నార్మల్ అయిన తర్వాత రెండోకాన్పు ఆపరేషన్ చేసిన సందర్భంలో వివరాలు పరిశీలించాలన్నారు. ప్రజల ఆరోగ్యం, గర్భిణుల సంక్షేమం, రక్తహీనత లోపం నియంత్రణపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గర్భిణీ మొదటి దశ నుంచే అవగాహన కల్పించాలని, సాధారణ ప్రసవాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని తెలి పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధి కారి డాక్టర్ ధన్‌రాజ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ట్రిపుల్‌ఐటీలో మహిళా దినోత్సవం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశాన్ని నిర్వహించనున్నట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సమావేశంలో వీసీ వెంకటరమణ, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ ఐఏఎస్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

'సుగుణ'కు సుష్మాస్వరాజ్ అవార్డు



అవార్డు అందిస్తున్న బండి సంజయ్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సుష్మాస్వరాజ్ అవార్డుకు ఎంపికైంది. నాగసముద్రం గ్రామానికి చెందిన సుగుణ వ్యవసాయంలో సేంద్రియ సాగుతో పాటు విభిన్న రకాల పంటలు పండించి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆమెను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన సివిల్ జడ్జి

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం సివిల్ జడ్జి మారెంరెడ్డి అర్పిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశలో పలు అంశాలు బోధించారు. యువతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, దురలవాట్లకు గురైతే కలిగే దుష్పరిణామాలు, వాటి పర్యావసనాలకు లోనవుతున్న టీనేజ్ బాలికల తీరు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒకరిపై అడవి పందుల దాడి



గాయాలపాలైన ఆడే సంతోష్

నేరడిగొండ: మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆడే సంతోష్‌పై అడవి పందులు దాడి చేశాయి. గురువారం గ్రామ శివారులోని పొలం పనులకు వెళ్లగా అతడిపై అడవి పందులు దాడికి పాల్పడ్డాయి. గాయాలైన సంతోష్‌ను చికిత్స నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పచ్చని విద్యాలయం



ఆహ్లాదం పంచుతున్న ట్రిపుల్‌ఐటీ

- హరితహారంలో నాటిన మొక్కలు..
- రోడ్లకు ఇరువైపులా పచ్చదనం
- క్యాంపస్ అంతా పచ్చని చెట్లు









భైంసా: చదువుల తల్లి సరస్వతీ నిలయమైన బాసరలోని ట్రిపుల్‌ఐటీ కళాశాల పచ్చదనంతో కళకళలాడుతోంది. క్యాంపస్ అధికారుల ప్రత్యేక శ్రద్ధకు అక్కడి సిబ్బంది, విద్యార్థుల కృషి తోడుకావడంతో పరిసరాలు ఒక్కసారిగా క్లీన్ అండ్ గ్రీన్‌గా మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఇక్కడి విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ క్యాంపస్‌లో 30వేలకుపైగా మొక్కలునాటారు. భవనాలకు వెళ్లే రహదారులు, క్యాంపస్ పరిసరాలు, మైదాన ప్రాంతం ఇతర చోట్ల మొక్కలు నాటారు. ప్రతి రోజు సమయం దొరికినప్పుడల్లా ట్రిపుల్‌ఐటీ సిబ్బంది, విద్యార్థులు, వాలంటీర్లు వాటిని సంరక్షిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్లపై చెత్తాచెదారం పారేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందంగా పెరిగిన ఈ చెట్లపై చుట్టు పక్కల నుంచి వచ్చే పిచ్చుకలు, పావురాలు ప్రతి సాయంత్రం సందడి చేస్తున్నాయి.

వచ్చిన వారల్లా మొక్కలునాటి...

ట్రిపుల్‌ఐటీకి వచ్చిన ప్రముఖులంతా మొక్కలునాటి వెళ్తున్నారు. ఏ కార్యక్రమానికి పిలిచిన ముఖ్య అతిథులుగా వచ్చినవారంతా ఈ క్యాంపస్‌లో మొక్కలునాటుతుంటారు. దీంతో మొక్కలు పెరిగి చెట్లుకు మారి పచ్చదనాన్ని పంచుతున్నాయి. అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇదే జిల్లాకు చెందిన వారు కావడంతో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హరితహారం ప్రతి విడతలోనూ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌కు వెళ్లి మొక్కలు నాటి వస్తున్నారు. హరితహారంలోనే కాకుండా ట్రిపుల్‌ఐటీ అధికారులు సుందరీకరణ కోసం సుదూర ప్రాంతాల నుంచి మొక్కలు తీసుకువచ్చి ఈ క్యాంపస్‌లో నాటారు. ప్రస్తుతం ఈ మొక్కలన్నీ పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

హరితహారం అవార్డు...

బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రభుత్వం హరితహారం అవార్డు ఇచ్చింది. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈనెల 7న ట్రిపుల్‌ఐటీ అధికారులు అవార్డు అందుకున్నారు. మంత్రి కేటీఆర్ ఈ ఏడాదిలో రెండు పర్యాయాలు బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చారు. ఇక్కడి అధికారులు క్యాంపస్‌లో మొక్కల పెంపకంతో పాటు ఈకో పార్క్, మొక్కల పెంపకం చూసి సంతోషం వ్యక్తం చేశారు. చదువుకునే క్యాంపస్‌లో పిల్లలంతా ఇష్టంగా నాటిన మొక్కలన్నీ పచ్చని చెట్లు అయ్యాయని ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని కేటీఆర్ అన్నారు.

అంతటా మొక్కలు నాటాం

ట్రిపుల్‌ఐటీ అంతటా మొక్కలునాటి పెంచుతున్నాం. హరితహారంలో గతంలో నాటిన మొక్కలన్నీ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నాటిన మొక్కలను రోజు నీరుపట్టిస్తూ చుట్టు వాటికి కంచె ఏర్పాటుచేసి రక్షిస్తున్నాం. సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ట్రిపుల్‌ఐటీ రహదారుల వెంట నాటిన మొక్కలన్నీ పచ్చని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రతి ఒక్కరి సహకారం అందించడంతో ట్రిపుల్‌ఐటీలో నాటిన మొక్కలన్నీ చెట్లుగా మారి ఆహ్లాదం పంచుతున్నాయి.

– వెంకటరమణ, వీసీ ట్రిపుల్‌ఐటీ బాసర

మృతుడి బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

కుభీర్: మండలంలోని పాంగ్ర గ్రామానికి చెందిన యువకుడు నామద్కర్ దిలీప్(24) ఫిబ్రవరి 8న కనిపించకుండా పోయాడు. బుధవారం ఆయన శవం గ్రామశివారులోని చెరువులో లభించగా కుటుంబీకులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే గురువారం మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. దిలీప్ చెరువులో పడి చనిపోలేదని, పంటలకు పెట్టే విద్యుత్‌షాక్‌తో చనిపోతే శవాన్ని చెరువులో పారేశారని అనుమానం వ్యక్తం చేశారు. మృతిపై అనుమానం ఉందని, విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై ఎండీ షరీఫ్ చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కైరే దత్తా (45) మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కైరే దత్తా–నాగబాయి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో భార్య నాగబాయి ఈ విషయమై మందలించడంతో ఇరువురు గొడవపడ్డారు. దీంతో భార్య ఇద్దరు కుమారులు శశికాంత్, బాలాజీలను తీసుకొని అదే గ్రామంలోని వారి పుట్టింటికి వెళ్లింది. వీరి పెద్ద కుమారుడు మురళి హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఇంట్లో ఉంటూ అతిగా మద్యం సేవించాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తెల్లవారు జామును చిన్న కొడుకు బాలాజీ ఇంటి వైపు వెళ్లగా తండ్రి ఉరేసుకుని కనిపించడంతో స్థానికులకు తెలిపాడు. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. భార్య నాగబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర బృందం



భీమిని పాఠశాలలో బృందం సభ్యులు

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. సభ్యులు పాఠశాలలో రికార్డులు, మార్కుల నమోదు ప్రక్రియ, తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాసాగర్ అన్నారు. అనంతరం భీమిని ఉన్నత పాఠశాలతో పాటు జగ్గయ్యపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో పీఎంకేవీవై 4.0 షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. పదోతరగతి, ఐటీఐ పూర్తి చేసిన, ఐటీఐ మధ్యలో ఆపేసిన, కళాశాల మధ్యలో మానేసిన 16 నుంచి 45 సంవత్సరాల అభ్యర్థులు అర్హులన్నారు. ఎలక్ట్రిక్ డొమెస్టిక్ సొల్యూషన్స్, సోలార్ ఎల్ఈడీ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్ డెవలపర్ కస్టమైజ్డ్ కోర్స్, వెల్డర్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

డబ్బులు కాజేసిన క్యాషియర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఖాతాదారులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలు చేసి డబ్బులు కాజేసిన బ్యాంక్ క్యాషియర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆదిలాబాద్ మెయిన్ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పనిచేసిన ఎ.యుగేందర్ ఖాతాదారుల ప్రమేయం లేకుండానే డబ్బులు విత్‌డ్రా చేసినట్లు ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గుగులావత్ ఇందల్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బ్యాంక్‌లో మే 2022లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఆయన జూలై వరకు నలుగురు ఖాతాదారుల సంతకాలు ఫోర్జరి చేసి వారి అకౌంట్లలో నుంచి రూ.లక్షా 60వేలు విత్‌డ్రా చేశాడు. దీంతో మంజర సక్కుబాయి, ఓటీకర్ కరుణలు అనే ఇద్దరు ఖాతాదారులు బ్యాంక్‌లో ఫిర్యాదు చేశారు. అకౌంట్‌ల నుంచి డబ్బులు మాయమవుతున్నాయని తెలిపారు. దీంతో విచారణ జరిపి అప్పట్లోనే సదరు క్యాషియర్‌ను సస్పెండ్ చేశారు. కాగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కరెంట్ షాక్‌తో యువరైతు మృతి



రాజుల భీమేశ్(ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన రాజుల భీమేశ్(30) గురువారం పంటపొలంలో కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం.. భీమేశ్‌కు మేడిపల్లి పక్కనే ఉన్న ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఒకటిన్నర ఎకరం భూమి ఉంది. అందులో మొక్కజొన్న పంట వేసి అడవి పందులు రాకుండా పంట చుట్టూ కరెంటు తీగలు అమర్చాడు. ఉదయం మొక్కజొన్నకు నీరు పారించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న తోట యజమాని గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిశీలించగా భీమేశ్ అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య అమత, పది నెలల బాబు ఉన్నాడు. రైతులు ఎవరు తమ పంట పొలంలో కరెంటు తీగలు పెట్టొద్దని, సోలార్ ఫెన్సింగ్ ద్వారా పంటను కాపాడుకోవాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లి.. కనిపించకుండా పోయాడు



శ్రీనివాస్ (ఫైల్)

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన బొంతల శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం ఈ నెల 4వ తేదీన ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు. ఎయిర్‌పోర్టులో దుబాయ్‌లోని ఏజెంటు కోసం వేచిచూశాడు. ఏజెంటు వచ్చేంతవరకు ధన్నూర్‌లోని ఆయన భార్య గీత (లావణ్య)తో పాటు ఇద్దరు కుమార్తెలతో వీడియో కాలింగ్‌లో మాట్లాడాడు. దాదాపు 12గంటల పాటు ఎయిర్‌పోర్టులోనే ఉన్నానని తెలిపాడు. కొంత సమయానికి మళ్లీ ఫోన్ చేస్తే కలవడం లేదని కుటుంబీకులు తెలిపారు. దుబాయ్‌లోని తమ బంధువులకు సమాచారం ఇవ్వడంతో దుబాయ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా గురువారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో భార్య గీత ఫిర్యాదు చేసింది. శ్రీనివాస్ జాడ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



మృతిచెందిన విజయేందర్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్(51) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విజయేందర్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో చోరీకి యత్నం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో సోలంకి రమేశ్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సదరు వ్యక్తి కాళ్లకు సంచులు కట్టుకుని చప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించాడు. గమనించిన పెంపుడు కుక్కలు అరవడంతో మేలుకున్న రమేశ్ ఇద్దరు కుమారులు దొంగను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం ఫిర్యాదు చేసేందుకు రమేశ్ భార్య పావని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సదరు దొంగ కనిపించలేదు. పోలీసులను ప్రశ్నించగా అతనికి మతిస్థిమితంలేదని, లారీ ఎక్కించి మహారాష్ట్రకు పంపించామని సమాధానం ఇచ్చారు. దొంగ పిచ్చివాడయితే పిచ్చాసుపత్రికి పంపించాలని, లారీలో ఎక్కించి మహారాష్ట్ర పంపించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను సంప్రదించగా దీనిపై తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

జీవాల వయస్సుకు తగ్గమేత

- పౌష్టికాహారంతో జీవాలు బలిష్టం
- ముక్కలుగా చేసి అందిస్తే మేలు



గొర్రెలు, మేకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు ఏ వయసులో ఎంత దాణా ఇవ్వాలి.. ఎండుగడ్డి, పచ్చిగడ్డి ఎంత మోతాదులో అందించాలి.. అనే విషయాలను పెంపకందారులు తెలుసుకోవడం చాలా అవసరం. మూగజీవాల వయసును బట్టి సరైన మోతాదులో ఆహారం అందిస్తే అవి బాగాఎదిగి బలిష్టంగా తయారవుతాయని, ఎండుమేతైనా, పచ్చిమేతైనా ముక్కలుగా చేసి అందిస్తే మేలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్‌కుమార్ సూచిస్తున్నారు.

చిన్నవయసు గొర్రె పిల్లలకు..

తల్లి పాలు తాగే వయసులో గొర్రె పిల్లలు కొరికి తినేందుకు వీలుగా ఎండిన లెగ్యూమ్ జాతి పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. 6 నుంచి 8 వారాల వయసు పిల్లలకు మధ్యగడ్డి, పప్పుజాతి ఎండుగడ్డి, నలగ్గొట్టిన గింజలు ఇవ్వాలి. 8 వారాల దాటిన తర్వాత తల్లి నుంచి పిల్లలను వేరు చేస్తారు. ఆ దశలో వాటికి క్రిపు దాణాను అందిస్తే త్వరగా ఎదుగుతాయి. ప్రతీరోజు ఒక్కో గొర్రె పిల్లకు 250 నుంచి 450 గ్రాముల దాణా, 2 కిలోల పచ్చిమేత అందేలా చూడాలి.

ఎదకు వచ్చిన సమయంలో..

గొర్రె ఎదకు వచ్చి పొర్లే సీజన్‌లో పప్పు జాతికి చెందిన ఎండుగడ్డితో పాటు రోజుకు 100 గ్రాముల ధాన్యపు గింజలు లేదా శరీర బరువులో 10వ వంతు పచ్చిమేత, 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

చూడికట్టిన సమయంలో..

చూడికట్టిన గొర్రెలకు సరైన మేత అందిస్తే పుట్టే పిల్లలు బలంగా ఉంటాయి. పాల దిగుబడి పెరుగుతుంది. అందుకే తినగలిగినంత ధాన్యపు జాతి పశుగ్రాసంతో పాటు రోజుకు 50 గ్రాముల వేరుశనగ చెక్క (పల్లిపొట్టు)అందించాలి. లేదంటే పొలాల్లో లభించే పంట అవశేషాలతో పాటు 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

ఈనే సమయంలో..

గొర్రె ఈనే సమయంలో ఆహారంలో ధాన్యపు గింజల పరిమాణం తగ్గించి నాణ్యమైన ఎండుమేత అందించాలి. ఈనిన తర్వాత నుంచి వారం రోజుల పాటు తౌడు, గింజల్ని 50 శాతం చొప్పున ఇవ్వాలి. పాలిచ్చే గొర్రెలకు ప్రతీరోజు 450 గ్రాముల ఎండుమేత , 250 గ్రాముల ధాన్యపు జాతి గింజల చొప్పున ఇవ్వాలి. లేదంటే 10 కిలోల పశుగ్రాసం అందించాలి. రెండేళ్ల పైబడ్డకా మేతతో పాటు ప్రతీరోజు 500 నుంచి 1000 గ్రాముల దాణా ఇవ్వాలి. పిల్లలు పుట్టిన తర్వాత 5 రోజుల పాటు జున్ను పాలు తాగించాలి. ఆ తర్వాత శరీర బరువులో 1/6వ వంతు చొప్పున నెల రోజుల పాటు పాలు తాగించాలి. రెండో నెల నుంచి శరీర బరువులో 1/15వ వంతు చొప్పున ఇవ్వాలి. పుట్టిన 2వ వారం నుంచి పిల్లలకు రుచికరమైన స్టార్టర్ దాణా, పచ్చిమేత ఇవ్వాలి. 3 నెలల వయసు నిండిన పిల్లలకు పాలు ఇవ్వడం మానేయాలి. 50 శాతం జొన్న, 25శాతం తౌడు, 12శాతం వేరుశనగ చెక్క, 11వెన్న తీసిన పాలపొడి, 2 శాతం ఖనిజ లవణ మిశ్రమంతో తయారు చేసుకున్న స్టార్టర్ దాణా అందించాలి. గొర్రెలు, మేకలకు దాణాతో పాటు ఖనిజ లవణ మిశ్రమం ఇవ్వడం వల్ల అవి ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. జీవాలు త్వరగా ఎదకు వస్తాయి. స్టాండర్డ్ కంపెనీలు చేసిన మిశ్రమాన్ని 2 శాతం మేర దాణాలో కలపాలి. లేదా విడిగా కూడా ఇవ్వవచ్చు. దాణాలో 1శాతం రాళ్ల ఉప్పును కూడా కలుపాలి.

ముక్కలు చేసి మేపాలి

పచ్చిమేత, ఎండుమేతలను అలాగే మేపితే జీవాలు వాటిని పూర్తిగా తినవు. పచ్చి పశుగ్రాసాల కాండాలు, చొప్పదంట్లు పెద్దవిగా లావుగా, ఆకులు వెడల్పుగా పొడువుగా ఉండడమే కారణం. జీవాలు కేవలం లేత ఆకుల్ని మాత్రమే పూర్తిగా తిని కాండాలు, దంట్లను వదిలేస్తాయి. అంతే కాకుండా వాటిని తొక్కి పాడుచేస్తాయి. మరోవైపు చొప్ప వంటి ఎండుమేత కొరత కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేతను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇందుకు మేతను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి మేపాలి. ఫారాల్లో పెంచే గొర్రెలు, మేకలకు పశుగ్రాసాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి అందించడానికి చాఫ్ కట్టర్, దాణా తయారు చేసుకోవడానికి గ్రైండర్ కమ్ మిక్సర్ ఉపయోగపడుతాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న చొప్పలను ఎండుమేతగా ఉపయోగించుకోవచ్చు.

నీటిని అందించడం ఇలా..

సాధరణంగా జీవాలకు వాటి శరీర బరువులో 10 శాతం నుంచి 12 శాతం నీరు అవసరమవుతుంది. కాబట్టి ప్రతీరోజు ఒక్కో జీవానికి సూమారు 5 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. ఫారాల్లో మేత తొట్లను ఏర్పాటు చేసినట్లు నీటితొట్లను కూడా ఏర్పాటు చేయాలి.

75 శాతం సబ్సిడీపై విత్తనాలు



స్వీట్‌సూడన్ గ్రాస్ ఎస్ఎస్‌జీ 898 రకం 5 కిలోల బ్యాగులను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తుకోవాలి. నాలుగు తడుల నీటితో 30 రోజుల చొప్పున నాలుగు సార్లు కటింగ్‌కు వస్తుంది. 30 నుంచి 40 టన్నుల వరకు పచ్చిమేత, 15 నుంచి 20 టన్నుల వరకు ఎండుగడ్డి దిగుబడి వస్తుంది. పూత దశకు వచ్చే సమయంలో కోతకోసి వాముగా నిల్వచేసుకోవచ్చు.

– జిల్లా పశువైద్యాధికారి

ట్యాక్స్ చెల్లించని ఇసుక ట్రాక్టర్లు సీజ్



నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య ఆదేశాల మేరకు గురువారం నెన్నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించకుండా ఆన్‌లైన్ ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక ఫ్లా ట్రాక్టర్, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు మంచిర్యాల అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలంటే ట్యాక్స్‌తో పాటు పన్నుపై 200 శాతం పెనాల్టీ కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనదారులు తమంతట తామే టాక్స్‌లను వెంటనే చెల్లించుకొని పెనాల్టీ నివారించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా అన్ని ధ్రువపత్రాలు ఉన్న ట్రాక్టర్లకే ఆన్‌లైన్‌లో ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాల్సిన మైనింగ్ శాఖ పట్టుబడ్డ ఈ ట్రాక్టర్లకు ఆన్‌లైన్ అనుమతి ఎలా ఇచ్చిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.